క్లుప్తంగా

మైనార్టీల సంక్షేమమే లక్ష్యం



ప్రొసీడింగ్స్ అందిస్తున్న నాయకులు

ఎల్లారెడ్డిపేట: మైనార్టీల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం లక్ష్యంగా పనిచేస్తోందని జిల్లాలోని మసీదులు, శ్మశానవాటికల నిర్మాణాలకు పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేస్తున్నట్లు కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్కే గౌస్ అన్నారు. మండలంలోని నారాయణపూర్ శ్మశానవాటికల నిర్మాణానికి రూ.3లక్షలు మంజూరు కాగా, ప్రొసీడింగ్స్‌ను ముస్లీం కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా గౌస్ మాట్లాడుతూ..గత ప్రభుత్వంలో మిగిలిపోయిన పనులతో పాటు కొత్త పనులకు కాంగ్రెస్ నిధులు కేటాయిస్తుందన్నారు. జిల్లా వ్యాప్తంగా మసీదులు, శ్మశానవాటికల నిర్మాణాలకు నిధులు మంజూరు చేయాలని వక్ఫ్‌బోర్డు చైర్మన్ అజ్మతుల్లాను కోరినట్లు తెలిపారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య, ముస్లిం కమిటీ సభ్యులు మోదిన్, షాదుల్లా, దస్తగిరి, ఇమామ్, రఫిక్, సమద్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కల్యాణం



కల్యాణ వేడుకల్లో పాల్గొన్న భక్తులు

ముస్తాబాద్: మండలంలోని రామలక్ష్మణపల్లెలో శ్రీ పెద్దమ్మ, పెద్దిరాజుల కల్యాణ ఉత్సవాలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా ముదిరాజ్‌లు ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. అంతకుముందు గ్రామ దేవతలకు బోనాలు తీశారు. అమ్మవారికి మహిళలు ఒడిబియ్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ముదిరాజ్ సంఘం సభ్యులు పాక కాశయ్య, మహేందర్, అంజయ్య, బాలయ్య, తిరుపతి, ఎల్లయ్య, బాబు, దేవయ్య, లచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తులు చేసుకోవాలి

బోయినపల్లి: గృహజ్యోతి పథకానికి అర్హులైన విద్యుత్ వినియోగదారులు తమ విద్యుత్ బిల్లు కాపీలతో మండల ప్రజాపరిషత్ కార్యాలయంలోని ప్రజాపాలన కౌంటర్‌లో దరఖాస్తు చేసుకోవాలని సెస్ ఏఈఈ జి. ప్రశాంత్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజాపాలన దరఖాస్తు జిరాక్స్, రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు, ఫోన్ నెంబర్, విద్యుత్ బిల్లు కాపీ జిరాక్స్ ప్రతులను ఎంపీడీవో కార్యాలయంలోని ప్రజాపాలన కౌంటర్‌లో అందించాలన్నారు. వినియోగదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన పేర్కొన్నారు.

నీటి ఎద్దడి నివారణకు చర్యలు

ముస్తాబాద్: వేసవిలో నీటి ఎద్దడి నివారణకు చర్యలు చేపట్టినట్లు ఎంపీడీవో భాస్కర్‌శర్మ తెలిపారు. సేవాలాల్‌తండా, తెర్లుమద్ది, బందనకల్ గ్రామాల్లో నీటిసమస్యను బుధవారం పరిశీలించినట్లు పేర్కొన్నారు. మిషన్ భగీరథలో చివరి గ్రామాలకు నీటి సరఫరా జరగడం లేదని గమనించామన్నారు. స్థానికంగా ఉన్న నీటి వనరులను ఉపయోగించుకునేందుకు పంచాయతీ కార్యదర్శులకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. ఎంపీవో ఆరీఫ్, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

రంగంపేట స్కూల్‌లో వెజిటేబుల్స్ డే



వీర్నపల్లి: మండలంలోని రంగంపేట ప్రైమరీ స్కూల్‌లో బుధవారం వెజిటేబుల్స్ డే నిర్వహించారు. విద్యార్థులు వివిధ రకాల కూరగాయల వేషధారణలతో ఆకట్టుకున్నారు. అనంతరం ఆకుకూరలు, పండ్లతో కలిగే ఉపయోగాలను ఉపాధ్యాయులు వివరించారు. హెచ్ఎం ప్రవీణ్, ఉపాధ్యాయులు మానస, వీణ, దివ్య, రాణి, సుజాత పాల్గొన్నారు.

రాజన్న ఆలయ చాంబర్ ముందుకు లారీ

- ఇబ్బందులు పడ్డ భక్తులు

వేములవాడ : సరుకులతో కూడిన ఓ లారీ బుధవారం చైర్మన్ చాంబర్ వద్దకు రావడంతో జిల్లా అడిషనల్ కలెక్టర్ గౌతమి ప్రయాణించే వాహనం కాసేపు నిలిచిపోయింది. అంతేకాదు చలువ పందిళ్ల కింద లారీ తిప్పుకోవడం గగనంగా మారింది. దీంతో భక్తులు, అధికారులు ఇబ్బందులు చాలాసేపు ఇబ్బంది పడ్డారు.



అందని 'పునరావాస' సేవలు



మండలకేంద్రంలోని దివ్యాంగుల పునరావాస కేంద్రం



పునరావాస కేంద్రంలో వృథాగా ఆట పరికరాలు

- ఏడాదిగా దివ్యాంగుల పునరావాస కేంద్రానికి అందని నిర్వహణ చార్జీలు
- రవాణా సౌకర్యం లేక రాని దివ్యాంగులు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు

కోనరావుపేట: శారీరక, మానసిక దివ్యాంగులకు పునరావాసం కల్పించి, వారికి వివిధ రకాల థెరపీలు, వ్యాయామం, ప్రత్యేక విద్యలో శిక్షణ ఇప్పించేందుకు ఏర్పాటు చేసిన వికాసం దివ్యాంగుల పునరావాస కేంద్రం లక్ష్యం నెరవేరడం లేదు. మండలంలోని పలు గ్రామాల నుంచి మండలకేంద్రానికి రవాణా వసతులు లేకపోవడంతో ఆదరణ లభించడం లేదు. రవాణా సౌకర్యం లేని కారణంగా వికలాంగులైన తమ చిన్నారులకు పునరావాస కేంద్రం సేవలు అందకుండా పోతున్నాయని వారి తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

2015లో ఏర్పాటు

మండలకేంద్రంలోని అంకంపేట చౌరస్తాలో 2015లో జిల్లా గ్రామీణాభివద్ధి సంస్థ ఆధ్వర్యంలో వికాసం దివ్యాంగుల పునరావాస కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. శారీరక, మానసిక వికలాంగ విద్యార్థులను బాగుచేయడం ఈ కేంద్రం ప్రధాన లక్ష్యం. వికలాంగ విద్యార్థులకు ఫిజియోథెరపీ, స్పీచ్ థెరపీ, ప్రత్యేక విద్యపై శిక్షణ ఇప్పించి, వారిలో మనోస్థైర్యాన్ని నింపాలి. ఇందుకోసం రూ.3లక్షల విలువ చేసే సామగ్రిని కేంద్రానికి అందించారు. విద్యార్థులకు నేర్పించేందుకు శిక్షణ పొందిన కార్యకర్త, వారి బాగోగులు చూసుకునేందుకు ఆయాను నియమించారు. విద్యార్థుల అవసరాలను చూడాల్సిన సీసీ శంకర్ రోజూ వచ్చి వెళ్తున్నాడు. ఈ పునరావాస కేంద్రంలో కోనరావుపేట, శివంగాలపల్లి, నిజామాబాద్, ఎగ్లాస్‌పూర్, వెంకట్రావుపేట, నిమ్మపల్లి, వట్టిమల్ల, మరిమడ్ల గ్రామాలకు చెందిన 20 మంది విద్యార్థులు నమోదై ఉన్నారు.

నిర్వహణ ఖర్చులు లేక..

కోనరావుపేటలోని పునరావాస కేంద్రంలో శిక్షణ పొందుతున్న విద్యార్థులు తగిన రవాణా సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నారు. పలు గ్రామాలనుంచి మండలకేంద్రానికి బస్సు సౌకర్యం కూడా లేదు. విద్యార్థులను కేంద్రానికి ఆటోలో తరలించేందుకు సెర్ప్‌నుంచి నెలకు రూ.20 వేలు అందించేవారు. 2022 ఏప్రిల్ నుంచి వారు అందించకపోవడంతో కొన్నినెలల పాటు మండలసమాఖ్య నుంచి డబ్బులు సమకూర్చారు. గతేడాది ఏప్రిల్ నుంచి డబ్బులు లేకపోవడంతో ఆటో బంద్ అయింది. విద్యార్థులూ రావడం లేదు. మండలకేంద్రం నుంచి కనీసం ఇద్దరు, ముగ్గురు విద్యార్థులు కూడా రావడం లేదు. ఇతర గ్రామాలకు చెందిన విద్యార్థులెవరూ రాకపోవడంతో అటు అధికారులు, ఇటు ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడంతో కేంద్రానికి ఆదరణ కరువైందని విద్యార్థుల తల్లిదండ్రులు పేర్కొన్నారు.

రవాణా సదుపాయాలు లేవు

కోనరావుపేటలోని పునరావాసకేంద్రంలో చిన్నారులను తరలించేందుకు సరైన రవాణా సదుపాయాలు లేవు. గతేడాది నుంచి నిర్వహణ చార్జీలు కూడా రావడంలేదు. మండల సమాఖ్య నుంచి రూ.50 వేలు ఖర్చు చేసి కొద్ది రోజులు కొనసాగించాం. నిర్వహణ చార్జీలు వస్తే కేంద్రంలో సమస్యల పరిష్కరించేందుకు వీలు కలుగుతుంది.

– లింగంగౌడ్, ఇన్‌చార్జి ఏపీఎం, కోనరావుపేట

పకడ్బందీగా ముందుకెళ్తాం..

- మహాశివరాత్రికి ప్రణాళికలు సిద్ధం
- పారిశుధ్యం లోపించకుండా చర్యలు
- వేములవాడ మున్సిపల్ కమిషనర్ అన్వేశ్



అన్వేశ్, కమిషనర్

వేములవాడఅర్బన్: దక్షిణకాశీగా ప్రసిద్ధి చెందిన వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 7, 8, 9 తేదీల్లో అంగరంగ వైభవంగా నిర్వహించే మహాశివరాత్రి వేడుకల్లో పారిశుధ్య నిర్వహణకు పకడ్బందీగా ముందుకెళ్తామని వేములవాడ మున్సిపల్ కమిషనర్ అన్వేశ్ తెలిపారు. ఇప్పటికే ప్రణాళికలు సిద్ధం చేసినట్లు పేర్కొన్నారు. రాజన్న ఆలయం, జాతరగ్రౌండ్ ప్రాంతాల్లో ఎక్కడ కూడా అపరిశుభ్రత లేకుండా దృష్టి సారిస్తామన్నారు. పారిశుధ్య సిబ్బందిని మూడు రోజులు, 24 గంటలు రోజుకు మూడు షిఫ్టులుగా పనులు చేయించేందుకు ప్రణాళికలు రూపొందించినట్లు వివరించారు. మహాశివరాత్రి ఏర్పాట్లపై మున్సిపల్ కమిషనర్ అన్వేశ్‌తో ఇంటర్వ్యూ ఆయన మాటల్లోనే..

ఇతర మున్సిపాలిటీల నుంచి సిబ్బంది..

- వేములవాడలో ఈనెల 7, 8, 9 మూడు రోజుల పాటు జరిగే మహాశివరాత్రి వేడుకల కోసం వేములవాడ మున్సిపల్ నుంచి 100 మందిని ఏర్పాటు చేస్తున్నాం. అంతేకాకుండా పెద్దపల్లి, జమ్మికుంట, కోరుట్ల, సుల్తానాబాద్, మెట్‌పల్లి నుంచి 225 మంది, ప్రవేటు లేబర్లు 180 మందిని తెప్పిస్తున్నాం.
- వేములవాడ పట్టణాన్ని 25 జోన్‌లుగా ఏర్పాటు చేశాం. పట్టణ వ్యాప్తంగా 60 డస్ట్‌బిన్లను ఏర్పాటు చేస్తున్నాం. చెత్తను తరలించేందుకు వేములవాడ మున్సిపల్ నుంచి 25 స్వచ్ఛ ఆటోలు, 6 ట్రాక్టర్లు, ఇతర మున్సిపల్ నుంచి 8 ట్రాక్టర్లను తెప్పిస్తున్నాం. ఆయా ట్రాక్టర్లలో సేకరించిన చెత్తను వేములవాడ మండలం అగ్రహారం గుట్టల్లోని డంపింగ్‌యార్డుకు తరలిస్తాం.
- మూడు రోజులపాటు మున్సిపల్ పారిశుధ్య సిబ్బందికి రాజన్న ఆలయం ఆధ్వర్యంలో భోజన వసతి ఏర్పాటుచేస్తున్నాం. పట్టణంలోని సినారె, పార్వతీపురం ధర్మశాలల్లో వసతి సౌకర్యం కల్పిస్తున్నాం.

'మహా శివరాత్రి'కి ఏర్పాట్లు



నాంపల్లి శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయం



ఆలయం ఎదుట ఏర్పాటు చేసిన చలువ పందిళ్లు

వేములవాడఅర్బన్: వేములవాడ రాజన్న అనుబంధ దేవాలయమైన నాంపల్లి శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయం మహాశివరాత్రి వేడుకలకు ముస్తాబవుతోంది. రాజన్న ఆలయంలో నేటినుంచి ఈనెల 9 వరకు మహాశివరాత్రి వేడుకలు జరగనున్నాయి. రాజన్నను దర్శించుకున్న భక్తులు నాంపల్లి గుట్టపై లక్ష్మీ నరసింహస్వామిని దర్శించుకుంటారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా ఆలయ అధికారులు అన్నిఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయం ముందు చలువ పందిళ్లు, గుట్ట చుట్టూ లైటింగ్, ఘాట్‌రోడ్డుకు, ఆలయం ముందు లైటింగ్ ఏర్పాటు చే శారు. భక్తులకు తాత్కాలిక మరుగుదొడ్లు ఏర్పా టు చేస్తున్నారు. 24 మంది పారిశుధ్య కార్మికులను ఏ ర్పాటు చేయనున్నారు. ధర్మగుండాలను శుభ్రం చే శారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా అ న్నిఏర్పాట్లు చేస్తున్నామని ఆలయ ఇన్‌చార్జి నరేందర్ తెలిపారు.

బీఆర్ఎస్ చేసిన అభివృద్ధి శూన్యం



సిరిసిల్లటౌన్: మాట్లాడుతున్న కేకే మహేందర్‌రెడ్డి



కోనరావుపేట : మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

సిరిసిల్లటౌన్: బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్ల అధికారంలో ఉన్నా జిల్లా అభివృద్ధికి చేసిందేమీ లేదని సిరిసిల్ల కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కే.కే మహేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని ఆయన కార్యాలయంలో మాట్లాడారు. మంత్రిగా పనిచేసిన కేటీఆర్ జిల్లాకు చేసిందేమీ లేదన్నారు. అధికారం పోయిందన్న అక్కసుతో సీఎం రేవంత్‌రెడ్డిపై కేటీఆర్ విమర్శలు చేసేస్థాయి కాదన్నారు. సిరిసిల్ల వస్త్ర పరిశ్రమకు ప్రభుత్వం నుంచి ఆర్డర్లు ఇచ్చినోళ్లు రూ. 360కోట్లు బకాయిలు లేకండా ఎందుకు చెల్లించలేదన్నారు. జిల్లా కేంద్రం కాబట్టే మెడికల్ కళాశాల వచ్చిందన్నారు. మహిళా డిగ్రీ కళాశాల ఏర్పాటు ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. బీఆర్ఎస్, తదితర పార్టీల నాయకులు కాంగ్రెస్‌లో చేరగా పార్టీలోకి ఆహ్వానించారు. కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాశ్, గోనె ఎల్లప్ప, వైద్య శివప్రసాద్, గడ్డం నర్సయ్య, గోలి వెంకటరమణ, బీమారం శ్రీనివాస్, గంభీరావుపేట ప్రశాంత్, అన్నల్‌దాస్ భాను తదితరులు పాల్గొన్నారు.

హామీలు నెరవేర్చని బీఆర్ఎస్..

ముస్తాబాద్: పదేళ్ల అధికారంలో ఉన్న కేటీఆర్ మండలానికి ఏం చేశారో చెప్పాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు యెల్ల బాల్‌రెడ్డి అన్నారు. మండలంలోని పార్టీ కార్యాలయంలో బుధవారం మాట్లాడారు. మండలానికి ముప్పై పడకల ఆస్పత్రి, ప్రభుత్వ డిగ్రీ కళాశాలలను అధికారంలో ఉండి కేటీఆర్ మంజూరు చేయలేదన్నారు. దుబ్బాక డబుల్‌రోడ్డుకు నిధులు మంజూరు చేశామని గొప్పలు చెప్పారని అది వాస్తవం కాదన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు నేరవేర్చని కేటీఆర్ ఇప్పుడు ఆరు గ్యారంటీలను అమలు చేస్తున్న కాంగ్రెస్‌పై ఆరోపణలు చేస్తున్నారన్నారు. ప్రజల్లో మహేందర్‌రెడ్డికి వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేక కుట్ర పన్నుతున్నారన్నారు. జెడ్పీటీసీ గుండం నర్సయ్య, మాజీ సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు కిషన్‌రావు, ఎంపీటీసీ శ్రీనివాస్, పట్టణాధ్యక్షుడు రాజు, డీసీసీ ప్రధాన కార్యదర్శి మిర్యాల్‌కార్ శ్రీనివాస్, నరేశ్, విజయ్‌రెడ్డి, రాంరెడ్డి, భాను, సత్యం తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయకుల ధర్నా సిగ్గుచేటు

కోనరావుపేట: ఎల్ఆర్ఎస్‌పై బీఆర్ఎస్ నాయకులు ధర్నా చేయడం సిగ్గుచేటని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సేక్ ఫిరోజ్‌పాషా అన్నారు. మండలకేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎల్ఆర్ఎస్ తీసుకవచ్చిందే బీఆర్ఎస్ ప్రభుత్వమని, పదేళ్లలో రైతులు, పేదలను పట్టించుకోకుండా, పింఛన్లు, రైతుబంధు అనర్హులకు అందించారన్నారు. అధికారం పోయినా బీఆర్ఎస్ నాయకులు మతిభ్రమించి మాట్లాడుతున్నారన్నారు. ఆది శ్రీనివాస్ విప్ అయిన కొద్దిరోజుల్లోరనే మండలానికి సీడీఎఫ్ నుంచి రూ. 75 లక్షలు, ఉపాధిహామీ నుంచి రూ.80 లక్షలు మొత్తం రూ. 1.50 కోట్లు తీసుకవచ్చారన్నారు. కార్యక్రమంలో డీసీసీ కార్యదర్శి కచ్చకాయల ఎల్లయ్య, నాయకులు చందనగిరి గోపాల్ గొట్టె రుక్మిణి, లింబయ్య, శ్రీనివాస్, సత్యం, నిత్యానందం, అజీమ్, సదానందం, రవీందర్‌రెడ్డి, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

మొక్కల సంరక్షణపై దృష్టి పెట్టండి

- డీఆర్డీవో శశిధర్

ఎల్లారెడ్డిపేట: ఉపాధిహామీ పథకంలో భాగంగా గ్రామాలవారీగా నిత్యం 100 మంది చొప్పున కూలీలు పనులకు హాజరయ్యేలా చూడాలని డీఆర్డీవో శశిధర్ పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్‌లో బుధవారం వీర్నపల్లి, గంభీరావుపేట, ఎల్లారెడ్డిపేట మండలాల ఉపాధిహామీ సిబ్బందితో సమీక్షించారు. ఎండ దెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. నర్సరీలలో వంద శాతం మొక్కలు బతికించుకోవాలన్నారు. ఎంపీడీవో సత్తయ్య, ఏపీడి నర్సింలు, ఏపీవోలు కొమురయ్య, అరుణ, శ్రీహరి పాల్గొన్నారు.

ఎంపీకి ఆహ్వానపత్రిక అందజేత



ఆహ్వానపత్రిక అందిస్తున్న గౌడ సంఘం సభ్యులు

ఎల్లారెడ్డిపేట: మండలంలోని నారాయణపూర్‌లో ఈనెల 11,12 తేదీల్లో నిర్వహించే శ్రీ రేణుకామాత –జమదగ్ని కల్యాణ వేడుకలకు రావాలని గౌడ సంఘం సభ్యులు బుధవారం ఎంపీ బండి సంజయ్‌కుమార్‌కు ఆహ్వానపత్రిక అందజేశారు. కరీంనగర్‌లోని ఆయన నివాసానికి ఆహ్వానపత్రిక అందించారు. గౌడసంఘం ఉపాధ్యక్షుడు బొల్గం రాధాకృష్ణగౌడ్, బొల్గం గోవర్ధన్‌గౌడ్, పర్శరాములు, శ్రీనివాస్ గౌడ్, తదితరులున్నారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు



మల్లికార్జున స్వామి ఆలయంలో పూజలు చేస్తున్న మహిళలు

ముస్తాబాద్: మండలంలోని తెర్లుమద్దిలో శ్రీ మల్లికార్జునస్వామి, ఎల్లమ్మ ఆలయంలో ప్రతిష్టాపన ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. స్వామివారి మూలవిరాట్‌ను బుధవారం ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజా హోమం నిర్వహించారు. యంత్ర ప్రతిష్ఠ, విగ్రహ ప్రాణప్రతిష్ఠ చేపట్టారు. పూర్ణాహుతి, కుంభాభిషేకం చేసి, రుత్వికులను సన్మానించారు. జెడ్పీటీసీ నర్సయ్య, మాజీ ఎంపీపీ లక్ష్మి, మాజీసర్పంచ్ కిషన్‌రావు, డీసీసీ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, శ్రీకృష్ణయాదవ సంఘం నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ

వేములవాడఅర్బన్: వేములవాడ మున్సిపల్ పరిధి తిప్పాపూర్‌లో ఇటీవల రేగుల దేవరాజు మృతిచెందగా బాధిత కుటుంబాన్ని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఏనుగు మనోహర్‌రెడ్డి బుధవారం పరామర్శించారు. ఇక్కడ నాయకులు నీలం శేఖర్, శ్రీనివాస్, అనిల్,విజయ్ తదితరులున్నారు.

కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలి



రుద్రంగి: మాట్లాడుతున్న చల్మెడ లక్ష్మీనర్సింహరావు

రుద్రంగి: బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పనిచేసి రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించాలని నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీ నర్సింహరావు అన్నారు. మండలకేంద్రంలో బీఆర్ఎస్ నాయకులతో సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ హాజరయ్యారు. బీఆర్ఎస్ అందించిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల, గ్రామ శాఖల అధ్యక్షులు దెగావత్ తిరుపతి, కమలాకర్, రుద్రంగి జెడ్పీటీసీ గట్ల మీనయ్య, వైస్ ఎంపీపీ పీసరి చిన్న భూమయ్య, నాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధి పేరుతో కాలక్షేపం

కోనరావుపేట: కాంగ్రెస్ ప్రభుత్వం కల్లబొల్లి మాటలతో కాలక్షేపం చేయడమే చేస్తున్న అభివృద్ధి ఏమీ లేదని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు చల్మెడ లక్ష్మీ నర్సింహరావు అన్నారు. మండలం మల్కపేటలో బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. పదేళ్లలో రాష్ట్రంలో ఎన్నో అభివృద్ధి పనులు చేసింది బీఆర్ఎస్ మాత్రమేనన్నారు. మనోహరాబాద్-కొత్తపల్లి రేల్వేలైన్‌ను మాజీ ఎంపీ వినోద్‌కుమార్ సాధించారన్నారు. ఆరు గ్యారంటీలతెటీ ప్రజలను మోసం చేస్తోందన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో వినోద్‌కుమార్ గెలుపునకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, ఎంపీపీ ఎదురుగట్ల చంద్రయ్య, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, మండలాధ్యక్షుడు మల్యాల దేవయ్య, సింగిల్‌విండో చైర్మన్ సంకినేని రాంమోహన్‌రావు, మహిళా నాయకురాళ్లు సంధ్య, ఎంపీటీసీలు, మాజీ సర్పంచులు, నాయకులు పాల్గొన్నారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



రాచర్లగొల్లపల్లిలో జీరో బిల్లు రసీదును అందజేస్తున్న నాయకులు

ఎల్లారెడ్డిపేట: ప్రభుత్వం అమలు చేస్తున్న 200 యూనిట్ల ఉచిత విద్యుత్‌ను నిరుపేదలు సద్వినియోగం చేసుకోవాలని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య, సింగిల్‌విండో వైస్ చైర్మన్ బుగ్గ కృష్ణమూర్తిశర్మ అన్నారు. మండలంలోని రాచర్లగొల్లపల్లి, బండలింగంపల్లి, వెంకటాపూర్‌లో బుధవారం ఉచిత విద్యుత్ జీరో బిల్లులను అందించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను అర్హులైన వారంతా వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సద్ది లక్ష్మారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్కే గౌస్, జిల్లా కార్యదర్శి వంగ గిరిధర్‌రెడ్డి, నాయకులు మర్రి శ్రీనివాస్ రెడ్డి, చెన్ని బాబు, బండారి బాల్‌రెడ్డి, పందిర్ల శ్రీనివాస్ గౌడ్, గుర్రపు రాములు, రఫిక్, తదితరులు పాల్గొన్నారు.

అర్హులకే ఇందిరమ్మ ఇళ్లు



మాట్లాడుతున్న నర్సయ్య

ఎల్లారెడ్డిపేట: ఎల్లారెడ్డిపేట, గంభీరావుపేట, వీర్నపల్లి మండలాల్లో అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు వస్తాయని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య తెలిపారు. మండల కేంద్రంలో బుధవారం విలేకరులతో మాట్లాడారు. ప్రతీ గ్రామంలో ఐదుగురు సభ్యులతో ఇందిరమ్మ గ్రామ కమిటీ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అర్హులనే లబ్ధిదారులుగా ఎంపిక చేయనున్నట్లు పేర్కొన్నారు. దశలవారీగా అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు వస్తాయని, ఎవరూ ఆందోళన చెందొద్దన్నారు.

'ఉపాధిహామీ సామాజిక తనిఖీ'



ఎల్లారెడ్డిపేటలో సామాజిక తనిఖీ నిర్వహిస్తున్న అధికారులు

ఎల్లారెడ్డిపేట: మండలంలోని వివిధ గ్రామాల్లో చేపట్టిన ఉపాధిహామీ పనులపై సామాజిక తనిఖీ బృందం సభ్యులు బుధవారం రికార్డులు పరిశీలించారు. మండలస్థాయిలో ఉపాధిహామీ పనులపై సామాజిక తనిఖీ నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా ముందుగా గ్రామాలవారీగా తనిఖీ బృందాలు వివరాలు సేకరిస్తున్నారు. ఎల్లారెడ్డిపేట, నారాయణపూర్, రాచర్లగొల్లపల్లి, రాచర్లబొప్పాపూర్, రాగట్లపల్లి, సింగారం, బండలింగంపల్లి గ్రామాల్లో తనిఖీలు నిర్వహించారు. ఎంపీడీవో సత్తయ్య, ఏపీవో కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

బియ్యం వితరణ



బియ్యం అందజేస్తున్న కౌన్సిలర్ రాజు

సిరిసిల్లటౌన్: పట్టణంలోని 36వ వార్డుకు చెందిన సాక గణేశ్ అనే నేత కార్మికుడు ఇటీవల మృతిచెందాడు. బుధవారం బాధిత కుటుంబాన్ని స్థానిక కౌన్సిలర్ కల్లూరి రాజు పరామర్శించి యాభై కిలోల బియ్యం అందించారు. ఇక్కడ వార్డు పెద్దలు గడ్డం వెంకటేశ్, కొక్కుల నర్సయ్య, కోడూరి మల్లేశం, తదితరులున్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



బోరు మోటారును ప్రారంభిస్తున్న నాయకులు

ఎల్లారెడ్డిపేట: మండలంలోని రా చర్ల తిమ్మాపూర్‌లో పలు అభివృద్ధి పనులకు బుధవారం జెడ్పీటీసీ చీటీ లక్ష్మణ్‌రావు, ఎంపీపీ పిల్లి రేణుక శంకుస్థాపన చేశారు. గ్రా మంలోని ముదిరాజ్ సంఘం భ వనం వద్ద మండల పరిషత్ ని ధుల నుంచి బోర్, మోటార్ వేసి ప్రారంభించారు. గ్రామంలో సీసీ రోడ్లు, ముగురుకాలువల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. సెస్ డైరెక్టర్ వరుస కృష్ణహరి, సింగిల్‌విండో చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి, ఎంపీటీసీ వరద బాబు, నాయకులు రవీందర్, కొండ రమేశ్ గౌడ్, అందెసుభాశ్, నర్సింలు, సాయిలు, సత్తయ్య, దేవేందర్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.